


# అభయ హస్తాలు

ఓం నమో భగవతే శ్రీరమణాయా

# అభయ హస్తాలు

(సద్గురు శ్రీ నాన్నగారి ప్రవచనాల నుండి)

సంకలనం

సాగిరాజు రామకృష్ణంరాజు

# అభయ హస్తాలు

**దుఃఖ నివారణ, శాంతిస్థితి:**

సృష్టిలో ప్రతీజీవి దుఃఖ స్పర్శలేని ఆనందంకోసం జీవిస్తాడు ఆనందం మన హృదయంలోనే ఉంది. మన మనస్సు అనే మేఘం అడ్డుతగిలి జ్ఞాన సూర్యుని కప్పి వేస్తున్నది. దుఃఖమనే చీకటిలో అలమటిస్తున్నాము. వస్తువు ఎక్కడ పోగొట్టుకొన్నామో అక్కడ వెదికితేనే దొరుకుతుంది. దీనికి "నేను ఎవడను" అనే జ్ఞాన విచారణ సూటి అయిన మార్గము. ధనం ఉంటే సుఖపడిపోతాము అని ఇంద్రియాల ద్వారా పొందే సుఖమే నిజమైనదని మనస్సు దుర్బోధ చేస్తుంది. నేను, నాది అనేది మనస్సుకు ఆలంబనాలు. మహాత్ములు ఈ "నేను" ను అతి తక్కువగా ఉపయోగిస్తారు పనిముట్లుగా మనం ఈ సత్యాన్ని గుర్తించలేక అహం కారానికి లొంగి స్వార్థంతో కల్పిత భయాలతో మన సంకె ళ్లను మనమే పోతపోసుకొని దుఃఖమయ జీవితాన్ని అను భవిస్తున్నాము. ఒక్కగాఢ నిద్రలోనే ఈ "నేను" మనలను విడిచిపెడుతున్నది. సుఖంగా ఉంటున్నాము. గాఢనిద్రలోని సుఖాన్ని, జాగ్రదవస్థలోని ఎరుక ఒకేసారి అనుభవంలోకి

తెచ్చుకోవటమే జీవితలక్ష్యం, అదే మోక్షం, అదే నిర్వాణ సుఖం, అదే స్వర్గరాజ్యం.

ముందుగా మనస్సు యొక్క అల్పత్వాన్ని, దాని పన్ను గడలను గమనించాలి. మలిన మనస్సు ఉన్నంతకాలం మలినాలతో (విషయాలతో) ఆడుకోకుండా ఉండలేము. ధనం అధికారం, అందం, తెలివి వీటితో తాదాత్మ్య చెంది స్వేచ్ఛగా జీవించలేకపోతున్నాము. "నిధిసుఖమా, రాముని సన్నిధి సుఖమా! జనిముగ తెలుపుము మనసా" అన్నారు త్యాగరాజు. ఈ సురూపాలు, ఈ కురూపాలు ఆలీలా మానుషుడు వేసుకొనే వేషాలు అని మనసుకు తెలపాలి. కూడుట ఎంతో విడిపోవటం అంతే, సహజం సంపద ఆపద, భోగం-రోగం, తప్ప ఆలోచనవల్ల, ఆందోళనతో కూడిన బుద్ధి వల్ల సత్యం తెలియుటంలేదు. సమాజంలో ప్రేమ - అనురాగం లేదు భగవంతుడు అంతటా ఉన్నాడని అందరినీ ప్రేమిస్తే జ్ఞానం కలుగుతుంది. మనం దుఃఖాలకు, బాధలకు అలవాటుపడి వాటిని పట్టుకొని వేళ్ళాడుతున్నాము అవి ఏదో అపూర్వమైనట్లు. ఊరికే ఉండ లేకపోతున్నాము. గోరంత విషయాన్ని కొండంత పెంచుకుంటున్నాము. నేను చైతన్యాన్ని అనే ఆశావాదిగా జీవించాలి. నిరాశావాది తన చుట్టూ

నరకాన్ని సృష్టించుకొంటూ జీవిస్తాడు. ఎన్నో వేల కోట్ల సంవత్సరాల నుంచి అస్తవ్యస్తపు పనులు చేసుకొంటూ మనస్సును భారంగా పెంచుకొన్నాము. దాని నివృత్తికి స్వయంకృషి, కాలపరిపక్వం, ఈశ్వరానుగ్రహం కావాలి. దానికి సహనం ఎంతో అవసరం మనం బాగుపడాలనే బుద్ధి ఉంటే గురుసహాయం అందుతుంది. ప్రతీ మనిషి జీవితంలో బ్రతుకును భారం చేసేది తలంపులే. ఈశరీరంలో ఉన్న పరమాత్మకు "నేను - నేను" అనేదే ముడిపెడుతున్నది. మనలో ఎన్ని దుర్గుణాలుఉన్నా ఏకాగ్రత ఉంటే అన్నీ రాలిపోతాయి. రాగ ద్వేషాలు రెండూ విసర్జించాలి. చిక్కులు ఎందుకు వస్తున్నాయి. అంటే కర్తనేను అనుకోవటం వల్ల. కర్త ఈశ్వరుడు అనే విశ్వాసం స్థిరంగా ఉండాలి. మనకు దుఃఖం రావటానికి మూలకారణంలోకాన్ని భరించలేక పోవటమే మనంలోకానికి దగ్గరగా ఉన్నాము. అందులో గొర్రెలు, మేకవన్నె పులులు ఉన్నాయి. లోకం దుఃఖమయం, జీవితం వ్యథామయం అని గ్రహించిన బుద్ధి సత్య సాక్షాత్కారానికై తపిస్తాడు. తరువాత గురువు లభిస్తాడు, సత్యం ఎరుక కలిగిస్తాడు ఇది సిద్ధాంతం. మనం త్రికరణశుద్ధిగా పవిత్రంగా నిర్మలంగా, నిశ్చలంగా ఉంటూ

ఆర్తితో గురువును నిరంతరం స్మరించాలి. శరణాగతే మనకు నిజమైన గతి అని భావిస్తే జీవితం సుఖమయమౌతుంది.

జీవితం ప్రారబ్ధానికి అనుగుణంగా నడుస్తుంది. అన్ని మర్చిపోయి ఆత్మనే కోరుకోవాలి. ఈ మనస్సు ఎవరి కోసమో ఏడుస్తూ ఉంటుంది. వాళ్ళకు నీకు ఏమిటి సంబంధం? అని ప్రశ్నిస్తే అవి జీవలక్షణాలు అని గ్రహించి ఏడుపు ఆగిపోతుంది. సమర్థత, స్థిరత్వము ఉన్నతత్వం కలిగి ఉండాలి. సర్వకాల సర్వ అవస్థలల్లోనూ గంభీరంగా ఉండాలి. మనలో ఉన్న అపవిత్ర స్వభావమే బయట ఏదో ఉంది. ఏదోఉంది అనిపింపజేస్తుంది. బయట ఏమీలేదు అంతా పంచభూతాలే. ఏ శక్తి అయితే మిమ్ములను ఈ భూమి మీదకు తెచ్చినదో ఆశక్తే మిమ్ములను కొంతమందిచే పొగిడిస్తుంది. కొంతమందిచే తిట్టిస్తూ ఉంటుంది. దీనికి మీరు కంగారు పడకండి మీ తలంపులకు మీరులొంగిపోతున్నారు. అది నష్టం చేస్తూ ఉంటే మీరు స్వతంత్రులు ఏలా అవుతారు. మీ ఇంద్రియాలకు మీరు హితవు చెప్పకోండి. మీరు బెంగపెట్టుకొంటే వాసన ఉన్నట్లే లెక్క, దుఃఖాన్ని భూతద్ధం లోంచి చూడటం మానేయండి. మనస్సులేని వానికి బెంగలులేవు. దేహంతో తాదాద్మ్య పొందితే అశాంతి, పొందక

పోతే శాంతి. ఈశ్వరుడు ఇచ్చిన ఈస్వేచ్ఛను నీవు సద్విని యోగం చేసుకొంటే దైవ సంపదలోకి వెళతావు. దుర్వి నియోగం చేసుకొంటే అసుర సంపదలోకివెళ్ళి అధోగతి పాలౌతావు.

నీవు ఆత్మ విశ్వాసం పొందకపోతే మరణించినట్లే, నీకు ఆవిశ్వాసం ఉంటే ఆకాశంలో ఎన్ని నక్షత్రాలు ఉన్నాయో అంతమంది శత్రువులు ఉన్నా నీకు ఏ హానీ జరగదు. లౌకికమైన తాత్కాలికమైన విషయాల్లోకి వెళితే అజ్ఞానంలో పడతారు. మన గమ్యం నిరంతరం గుర్తు చేసుకోవాలి. అహంకారం యొక్క స్వభావాన్ని మూటకట్టి ఒక ప్రక్కన పెట్టండి. మనస్సును ఆత్మవైపు మరల్చండి. మనస్సు చల్లబడటానికి పవిత్రత, ప్రశాంతత సహకరిస్తాయి. బాధాతప్తమైన మనస్సు స్పష్టంగా ఆలోచించలేదు. బానిస బుద్ధి ఉన్నవారే ఎక్కువగా భయపడతారు. విచక్షణా బుద్ధిలేక మదనపడతారు. ఈ సంఘటన ఇలా జరిగింది ఏమిటి? ఆ సంఘటన అలా జరిగింది ఏమిటి? అనుకొంటాము కాని, ఈశ్వర ప్రణాళికలో అలా జరగాలి కాబట్టి అలా జరిగింది అని గ్రహిస్తే వివేకవంతులు అవుతారు. మన సంకల్పం జరగాలి అనుకోవటం వల్లనే దుఃఖం ప్రారంభ

మౌతుంది. మనకు ధైర్యం, ఓర్పు లేదు అనుకోండి వాటిని సంపాదించాలి. మన దురదృష్టం గురించి బాధపడటంకన్న చాలామంది కన్న మనం అదృష్టవంతులమని భావించి సహనంతో, తృప్తితో జీవించినట్లయితే భగవంతుని ప్రేమించినట్లే. మంచివారి మధ్య జీవితాన్ని కల్పించినది తరించటానికి వందజన్మలు పడితే దుర్మార్గుల కుటుంబ సభ్యుల యందు జీవిత యాత్రచేస్తే ఒక్క జన్మతోనే తరిస్తావు. ఏ దుర్మార్గుని గురించి నిరంతరం ఆలోచిస్తూ ఉంటే ఆదుర్మార్గమే నీకు గతి అవుతుంది కాబట్టి వారిని మరిచిపోవాలి. ఎవరైనా మనలను కించపరిచినా బాధ పడకూడదు. మనంకాని సమస్యలను మనం సృష్టించుకొని జీవితాన్ని బుగ్గిపాలు చేసుకొంటాము మనమనస్సు ఎంత నిజమో వారి మనస్సు అంతే నిజం సమస్యలకు ఊగిపోకూడదు.

శక్తిని సరిగ్గా వినియోగిస్తే నరకాన్ని కూడా స్వర్గంగా మార్చుకోవచ్చును. గురుదయవల్ల, వివేకం వల్ల గోవిందుణ్ణి భజించటంవల్ల అసాధ్యంకూడా సుసాధ్యమౌతుంది. ముందు మనకు దుఃఖం వస్తూ ఉంటే దానికి ఇతరులు కారణంకాదు. ప్రారబ్ధంవల్లనే వస్తుంది. తిరియాటికల్

నాలల్జిలో నే జీవించక ప్రాక్టికల్ నాలల్జిలో జీవించాలి. ప్రతీ అనుభవం టీచింగ్ కోసం ఏర్పాటుచేయబడినదే కాబట్టి మనం తరించటానికి బుద్ధిని దీపంగా పెట్టుకొని జీవించాలి. ఏధైనా చెడ్డ జరిగితే అది తలచుకొని బాధపడకూడదు. భవిష్యత్తులో అది మంచే చేస్తుందని తెలిస్తే దుఃఖం ఆరిపోతుంది. నిరంతరం మన జీవిత సమస్యల గురించి ఆలోచిస్తూ ఉంటే మనగొయ్యి మనం తవ్వుకున్నట్లే విచారణ జరగకపోవటమే దుఃఖహేతువు మన దేహం ఎంత నిజమో, విరోదులు అంతేనిజం. అవి అన్నీ పట్టించుకొంటే మనస్సు బాహ్యముఖమై దుఃఖానికి గురి అవుతావు. మనం బయట మనుష్యులతో పోరాటం కాదు. ఈశ్వరునిపై ఉన్న అవిశ్వాసంతో పోరాడాలి అదే సాధన.

భగవంతుని మీద భారంపెట్టే వానికి బాధలు తగ్గుతాయి. కొందరు ఏమిజరిగినా చెలించరు వారికి జ్ఞానం రావటానికి ప్రిపరేషన్ ఉంది అని అర్థం. మనకు ఆత్మానుభవం కలగకుండా అడ్డువచ్చే విరోధులు ప్రతీ జన్మలోనూ ఉంటారు. ఓర్పుతో వారి నుండి తొలగి ముందుకు సాగాలి. అందరినీ నియమించేవాడు ఈశ్వరుడే ఎందుకు ఈ గోల వారిని క్షమించి మరిచిపోవాలి లేకపోతే వాటిని

బ్రతికించుకొన్నట్లే. దానితో మనం గమ్యాన్ని తప్పిపోతాము. మనకు ఎన్నో కళ్యాణ గుణాలు ఉంటేగాని ఆత్మజ్ఞానం కలుగదు. భగవంతుని అస్తిత్వంపై పూర్ణ విశ్వాసం ఉంటే మనకు తెలియ కుండానే పనులు పూర్తి అవుతాయి. సాధనలేకుండానే మనస్సు అదుపులోకి వచ్చేస్తుంది. "నాకు ఆత్మ బుద్ధిని కలుగజేయి నీపాదాల మీద నాకు విశ్వాసం ఉండేటట్లు అనుగ్రహించు నేను ఎంతో కొంత ప్రయత్నము చేస్తాను కాని విశ్వాస బలాన్ని నీవే ఇయ్యాలి" అని భగవంతుణ్ణి ప్రార్థించాలి. హృదయ నైర్మల్యానికై ఆలోచన విడిచిపెట్టాలి. నవ్వుతూచేసే హింసాకార్యం ఏడుస్తూ అనుభవించే రోజువస్తుంది.

అద్దం ఎదుట ప్రతిబింబాలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. అద్దాన్ని మలినం చెయ్యలేవు అలాగే కామ క్రోధాలు కలిగినప్పడు వాటిని చేతల్లో పెట్టకుండా వస్తూ పోతూ ఉండనియ్యాలి. విచక్షణతో వివేకంతో వాటిని అవగాహన చేసుకోవాలి. మన ఎడల ఎవరైనా కాఠిన్యం ప్రదర్శిస్తే ఆతడు తన్నిన కాలి బంతిలా నీవు ఉండాలి. నిజమైన వినయం బలంకాని బలహీనత కాదు ప్రయత్న ప్రవాహం వల్లనే గమ్యాన్ని చేరుతావు సుప్రీమ్ స్టేజ్ నుంచి

జారిపోతే అడివిలో పడిపోతావు పర్వత శిఖరం నుండి పడ్డరాయిలా ఆత్మతత్వం నుండి జారిపోకూడదు, "మనస్సులో ఏ పిచ్చి పెట్టుకోకూడదు అప్పుడు పిచ్చిలేని వస్తువు (ఆత్మ) నీకు తెలియబడుతుంది" అన్నారు బుద్ధుడు. అది మనమే అన్న ఎరుక సదాజ్ఞప్తిలో ఉంచుకొంటే మనం భరించలేని ఆనందం, సుఖం మనలను వరిస్తుంది. మనలను చూచి ఎవరైనా అసూయపడుతూ ఉంటే వారికి దూరంగా ఉండాలి వారితో స్నేహం వద్దు, విరోధం వద్దు, ఉదాసీనంగా ఉండాలి. అందరినీ ప్రేమించుకాని అందరినీ నమ్మవద్దు నీ వివేకాన్ని సరిగా పోషించుకో శ్రీరామతీర్థులు" ఏడుపును పోగొట్టే ఏడుపుకావాలి. రహస్యంగా భగవంతుని కోసం నిర్వేదించు. ఆత్మ విచారణ చేసుకో హృదయాన్ని మథించుకో ఏకాంతంగా భగవత్ సాక్షాత్కారానికై తపించు నీటికోసం చేపలా ఈ విషాద యోగం వల్ల కూడా నీకు లాభం కలుగుతుంది. విగ్రహం ముందు విగ్రహ భావన నశించాలి ఆస్థానంలో చైతన్య పూరితమైన భగవానుని దర్శించాలి అదే వాస్తవికమైన ఉపాసన" అన్నారు.

ప్రారబ్ధానికి ఓవర్‌గా రియాక్టు అవ్వకండి, గుఱ్ఱం బయలుదేరితే బండి దానివెనకాలే వస్తుంది అలాగే నీవు

శరణాగతి పొందితే శాంతినీవెనకాలే వస్తుంది. మన క్షమే ఆనందంగా మారిపోతుంది. భయం మనిషిని నిర్వీర్యం చేస్తుంది అహంకారం మేత కోసం ఏదో ఒకటి గుర్తు చేసుకొంటుంది. కుటుంబ సభ్యులపట్ల అతి దయ బంధిస్తుంది. శాంతిని కాపాడుకొన్నవానికి శక్తి కలుగుతుంది. జీవితంలో ఏది వచ్చినా నిలవదు. కంసాలి బంగారు వస్తువులను ఎన్ని సుత్తి దెబ్బలు కొట్టినా, సుత్తి స్థిరంగానే ఉంటుంది. అలాగే జీవితంలో ఎన్ని అవాంతరాలు వచ్చినా స్థిరంగా ఉండాలి. లోతుగా ఆలోచించటంవల్ల చాలా విషయాల్లోంచి బయట పడగలము. జరగబోయే జీవితం గురించి చింతించటంవల్ల ప్రారబ్ధాన్ని గురించి బెంగలతో జీవించకు. ఆత్మాను భవంలో అన్ని పోతాయి. నీ మమకారాలు అన్నీ కొట్టుకుపోతాయి. ఏమీ అనుకోకుండా ఉండండి భగవంతుడు ఒకడు ఉన్నాడనే విశ్వాసించాలు. ప్రతీదానికి మనస్సును పుండు చేసుకోకండి.

నిరంతరం మీరు దుఃఖానికి గురి అయితే మీకు వివేకం తక్కువ అని అర్థం. చిక్కులు ఎందుకు వస్తున్నాయి. అంటే "నేనుకర్తను" అనుకోవటంవల్ల. హృదయంలో సంతోషం నిండిపోతే కోరికేరాదు. మన గొప్ప తనాన్ని

తెలపాలనే కాంక్ష రానియ్యకండి. జరిగిపోయిన గొడవలు రోజూ తల్లపెట్టుకొంటే మీకు మోత మిగులు తుంది. గోక్కానే కొలది దురద ఎక్కువ అవుతుంది. తలంపులు పెంచు కొనేకొలది అవి ఎక్కువ అవుతాయి. ఈ తలంపులు ఎవరికి కలుగుతున్నాయి అని ప్రశ్నించు అహంకారానికి అని తెలిసి ఆగిపోతాయి. నీవు ఆత్మవు అంతే కాని నిరంతరం దుఃఖకరమైన పాత జ్ఞాపకాలల్లోనే ఉండకండి మాటల్లో అందం, ఎదుట వారిని ప్రేమించటంలో అందం రుచి చూచారా! వారికే భగవంతుని అనుగ్రహం తొందరగా కలుగుతుంది. ఇతరులు మిమ్ములను విమర్శిస్తే నీవు ఓర్చుకొంటే మిమ్ములను దేవతలు ఆశీర్వదిస్తారు అంతేకాదు అనతికాలంలోనే ఈశ్వరుడు వేయిమందితో స్తోత్రం చేసే ఏర్పాటు చేయిస్తాడు అది ఆయన విలాసం రామనామం కన్న గొప్పది చెబుతున్నాను "మాటజారకండి" మనకు భయం కలుగుతూ ఉంటే భగవంతుని మీద భారం వెయ్యటంలేదని అర్థం.

ఈసృష్టి అంతా భగవంతుని సంకల్పం ప్రకారం నడుస్తుంది అని అనుకొని జీవిస్తే మీకు దుఃఖం పుట్టదు. మీపని పూర్తి అవుతుంది తరిస్తారు. చర్మదృష్టి ఉన్నవాడు

ఆత్మవస్తువును చూడలేడు. పక్షి మనపై రెట్టవేస్తే కడిగి శుభ్రంచేసుకొని మర్చిపోతాము. అలాగే మనపైవచ్చే విమర్శ లను మనం మర్చిపోవాలి తలపెట్టుకోకూడదు. ఎందుకంటే ఎవరైతే నిజాయితీగా ఉండరో వారు ఇతరులను విమర్శించటానికి అలవాటుపడిపోతారు. వారిగురించి మన మానసిక ఆరోగ్యం పాడుచేసుకో కూడదు. ఒక దుర్మార్గుణ్ణి చూచిన వెంటనే మనకు ఎందుకు ఉద్రేకం వస్తుందంటే ఆద్వేషం మనమనస్సులో ఉంది కాబట్టి దోషం లేకపోతే ఉద్రేకం రానేరాదు మీకు గతించిన విషయాలు, విషయవాసనలు గుర్తుకువస్తున్నాయంటే మీరు పూర్తిగా మాయలో ఉన్నట్లే.

ఈ ప్రపంచంలో నీచాతినీచమైనది ఏమిటి అంటే పిరికితనం, భయస్తుడు, బద్ధకస్తుడు సత్యాన్ని తెలుసు కోలేడు. ఎక్కడ భ్రాంతి కలుగుతూ ఉంటే అక్కడ ఏమీ లేదని గుర్తుంచుకోండి. మీకు ఎవరిమీద ద్వేషం కలిగినా దానివెనకాల క్రూరత్వం వచ్చేస్తుంది. ఆపనికిమాలిన విషయాలను విడిచిపెట్టటమే సాధన. మీ అదృష్టం, మీ దురదృష్టం తాత్కాలికాలు కాలప్రవాహంలో కొట్టుకొని పోతాయి. దీన్ని మంత్రంగా భావించండి. మీ సాధనలో మీరు

అభివృద్ధిలోకి రావాలని ఉంటే ఇష్టా అయిష్టాలను తగ్గించుకోండి. మీకు ఎవరైతే విరోధంగా ఉన్నారో వారిని మీరు మర్చిపోకపోతే వాడు మీకు పదిజన్మలకాలాన్ని తీసుకొంటాడు. ఏ అనుభంధం గురించి మీకు తరచుగా గుర్తుకువస్తూ ఉంటే మీకు ఏకాగ్రత కుదరదు. శత్రుత్వం మనస్సును బాహ్యాముఖం చేస్తుంది. మీ ఇంద్రియాలను, కాళ్లనుచేతులను మీ బుద్ధి ఆగు! అంటే అగిపోతాయి. అలాగే మీ మనస్సును ఆగు అంటే అది ఆగుతుంది. కాని మీరు ఆస్థితిలో లేరు. మీరు ఆగమన్నా ఆగదు దానికిబలం మీరే గతంలో ఇచ్చారు. అది యజమానై కూర్చుంది. మీరు నీడలా దానివెంట పరుగెడుతున్నారు. మనస్సు ఒక పరికరం అది ఆత్మలా తయ్యారైనది కాని దైవంపట్ల భక్తి, ఆవేశంతో రోధిస్తే పరమానందం సిద్ధిస్తుంది. క్రమశిక్షణ, కఠోరదీక్షల తరువాత సాధకుడు సిద్ధంగా ఉన్నప్పుడు గురువు అడ్డంకులను తొలగించి దీక్షణిస్తాడు. కర్మలు పూర్తికాగానే కృపకలుగుతుంది. ప్రేమపూరిత గురువు లభించిన తరువాత గురువే సాధన గురువే సాధ్యం.

కర్మానుభం ఈషన్ మాత్రం ఉన్నా సత్యానుభవం కలుగదు. తెలివిగలవాడు దెబ్బలు తగలకుండానే ఈ

విషయం గ్రహిస్తాడు. కానీ కొందరు గ్రహించలేనివారు "ఎదురు దెబ్బ అనుభవం ఎదురుదెబ్బ తాకిన తరువాతే తెలుస్తుంది. ఇతరుల ఆశ్రయం వదిలినప్పుడే శక్తి సామర్థ్యం వస్తుంది ఒక కఠిన కర్కశమైన అనుల్లంఘనీయమైన మహాధర్మం ఏమిటీ అంటే ఎవరైతే పూజితులు కాదలుచు కొన్నారో వారు మొదట, పరిత్యాగవేదన అనుభవించవలసి ఉంటుంది. డబ్బు చెల్లిస్తే వస్తువు దొరుకుతుంది. ఇయ్యకపోతే బాకీ పుకస్తకం పంపుతారు తప్పదు. పూజ అంటే ప్రేమ, మర్యాద, గౌరవం. ఒక తెల్లసుద్ధతో తెల్లగోడమీద వ్రాయలేము, వ్రాసినా కనిపించదు కనిపించాలంటే నల్లబల్ల ఉండి తీరాలి జీవితం కూడా అలాగే ఉంటుంది. దుఃఖం ఉండకపోతే ఆమనిషికి సంతోషం అంటే ఏమిటో తెలియదు సాధ్యపడదు. వ్యత్యాసపు నేపథ్యం లేకపోతే తెలుసుకొనే మార్గం ఉండదు. కొలిమిలో కాల్చబడ్డ బంగారమే మేలిమి బంగారమౌతుంది. బాధల కొలిమిలో పడ్డవారే పవిత్రులై పరమ పదాన్ని అందుకొంటారు" అన్నారు ఓషో నమ్మకంగా శ్రద్ధగాచేసే క్రియలే సఫలమౌతాయి గురువు ఒకొక్కసారి కఠినంగా వ్యవహరించినా మన క్షేమం కోసమే నీకర్మల భారాన్ని తొలగించటానికి అలా చేస్తారు. గతజన్మలల్లో ఈరీతిగా వ్యవహరించినది కొంత

నీవు అనుభవించాలి, అది ఈశ్వరశాసనం. గురువు నీ పొరపాట్లను క్షమించవచ్చు కానీ అస్తిత్వం క్షమించదు. ఈ రహస్యం తెలియక కొందరు గురువును వదిలి వెళ్ళి పోతారు మరో మంచి గురువును చుసుకొందామని వారికి నిష్కృతిలేదు. కర్మజాలం నుంచి గురుసహాయం లేక విముక్తిపొందటం మహాకష్టం. జీవితం మనకు ఏమి ఇచ్చినా కృతజ్ఞతతో ఉండగలగటమే సాఫల్యానికి ప్రమాణం భయపడితే తెలివిగా ఉండలేము. వాస్తవంలో జీవించటం నేర్చుకోండి ఈక్షణం చైతన్యంగా, ఎరుకగా జీవించడం నేర్చుకొంటే అప్పుడు ఉండేది ఆనందం.

గురువైభవం :-

కర్మవలయంనుంచి మనం తప్పుకోవటం మన తరంకాదు అని నిస్సందేహంగా చెప్పవచ్చు కాని గురు అనుగ్రహంతో తేలికగా అధిగమించవచ్చును. వివేకానంద కష్టాల గురించి పరమహంసగారు అంటారు "ఇంకా ప్రొద్దు గూకలేదుకదా" అంటే అవి పోతాయి ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉంది అని అర్ధం. త్యాగరాజు "ఉపచారంచేసేవారు వాకిల్లోనే ఉన్నారు అని మరువకుమా" అన్నారు.

పిడుగులు వచ్చి మీదపడుతున్నా శాంతగా ఉండటం నేర్చుకోండి, గ్ఠురువు నీవెంట ఉన్నాడు. మీ ఆత్మ విశ్వాసమే మిమ్ములను ఉద్ధరిస్తుంది. గురుదయవల్ల మీకు వివేకం పెరుగుతుంది సమాజపరంగా, కుటుంబపరంగా మీకు సమస్యలు వస్తాయి అనుకోండి వాటిని ఎదుర్కొనే పోరాత పటిమను గురువు నీకు కలిగిస్తాడు. బుద్ధికి అవగాహన కలగ టానికి అంతే కాని కష్టాలు కలగాలని కాదు. తల్లిబిడ్డను దగ్గరకు తీసుకోవటానికై "అదిగో బూచోడు - అదిగో బూచోడు" అంటే పరుగెత్తుకొని అమ్మను కౌగలించు కొంటాడు. అలాగే నీకు కష్టాలు కల్పించినది గురువులో ఐక్యం కావటానికే. ఈశ్వరుని పాదాలు చూడగానే సంసారమును మరచి ఆనందపరవశుడు అవుతాడు. భాగవంతుడు గురు ప్రేమలో ఊగిసలాడీ వారి అహంకార మమకారాలు, వాటి, అంతట అవి రాలిపోతాయి. సింహం సంవత్సరకాలం అజ్ఞాతంలో ఉండి వేటకై బయటకువస్తే జంతువును ఎలా వెంటాడుతుందో, ఫల్గుణుడు ఎలా యుద్ధరంగంలోకి వచ్చాడో అలాగే మీ గురువు మీ ప్రారబ్ధంపైపడి చీల్చిచెండాడుతాడు మీ ప్రారబ్ధాన్ని మైనెస్ చేస్తాడు భక్తునిమీద ఈగ వాలనియ్యడు.

మీ మనస్సులో వాసనలు మిమ్ములను గోకుతున్నాయి అనుకోండి వాటినుండి బయట పడాలంటే సద్గురువును నిరంతరం స్మరించాలి. ఊహించకండి, నిరాసపడకండి, తరిస్తారు. ఒక హయ్యర్ పవర్ ఒకటి ఉందని మూల తలంపు గుర్తించిననాడు ఈశ్వరాజ్ఞనుంచి వచ్చిన ప్రార బ్ధాన్ని స్వీట్‌గా స్వీకరిస్తాడు సాధకుడు. నీ ప్రయత్నానికి అసాధ్యం ఉండవచ్చు కాని గురు అనుగ్రహానికి అసాధ్య మంటూ ఉండదు. నిన్ను ఒడ్డుకు చేరుస్తాడు. నీవు పోలేరమ్మలా ఊగిపోతే నిజం దగ్గరకు ఎలా వెళ్ళగలవు? ఎక్కడ తలంపులు లేవో, ఎక్కడ ఊహలలేవో అక్కడ సత్యం ఉంది. రోగాల్లో అన్నిటికన్న పెద్దరోగం సంసారం. దానికి మందు సజ్జనసాంగత్యం గ్రహించే శక్తి ఉన్నవానికంటే గ్రహించే శక్తిలేనివాడే తొందరగా ఆవేశపడతాడు.

మీ మనస్సు సమాజంతో సత్‌సంభంధాలు కలిగి ఉండటానికి ఉపయోగం కొరకే ఉంది. అది ఒక యంత్రం దానికి మీరు అతీతంగా చైతన్యంగా ఉన్నారన్న విషయం గుర్తుంచుకోండి. ఆత్మానుభవంతో బాధలు భయాలు అన్నీ కొట్టుకొని పోయి పరమ శాంతిలో ఊగిసలాడతావు. శక్తి, సుఖం అన్ని నిన్ను వరిస్తాయి నీవు వికారమైన తలంపులు

కల్పించుకొంటే నీగురువు బాధపడతాడు.

ఈ దేహం ఈ భూమి మీదకు ఎందుకు వచ్చినదో ఆపనులు ఈదేహం ద్వారా జరుగుతూ ఉంటాయి. ఆసంగతి భగవంతునికి తెలుసు. మీ మనస్సు బలం చెయ్యటానికి, మీకు ఆత్మ విశ్వాసం కలగటానికి, మిమ్ములను దుఃఖంలేని స్థితికి తీసుకొని వెళ్ళటానికి మిమ్ములను ఆదర్శ మానవునిగా తీర్చిదిద్దటానికి అనేక సంఘటనలను కల్పిస్తూ ఉంటాడు. అది అంతా భగవంతుడే చేస్తున్నాడని తెలియక దుఃఖం, భయం కలుగుతుంది. దోషాలు ఉన్నవానికి భగవత్ దర్శనం కలుగదు. ప్రతికూల పరిస్థితిలో కూడా ఓర్పుగా ఉంటే అది ఆధ్యాత్మిక జీవితానికి పునాది. దేహం నేను అనే తలంపు వేరుతో సహా తీసే వరకూ దుఃఖం తప్పదు. జీవిత సంఘటనలలో పాఠాలు నేర్చుకోవాలి. మన బుద్ధి చేతుల్లో మనస్సు ఉంటే పురోగతే, మనస్సుచేతిలో బుద్ధిఉంటే తిరోగతే. మనం ఈశ్వరునికోసం బ్రతికితే ఆనందం, అహంకారం కోసం బ్రతికితే దుఃఖం, అశాంతి మిగులుతాయి. మావి ప్రాపంచిక జీవితాలు అంతా ఈశ్వర సంకల్పంవల్లనే జరుగుతోంది అని జీవించలేము అంటారు. అసలు అంగీకరించకపోవటం వల్లనే దుఃఖం వస్తుంది

కాబట్టి ఆయన అస్థిత్వంపై సందేహం, అవిశ్వాసం రానియ్యకు. ఆయన ఏమి చేస్తాడో వేచిచూడు. నీజీవితాన్ని ఎందుకు ఏలా మలుపుతిప్పుతాడో ఏసత్ఫలితం వస్తుందో వేచిచూడు తొందరపడవద్దు, ఆందోళన పడవద్దు. నువ్వు చెప్పినట్లు ఈశ్వరుడు నడుచుకోవాలని అనుకోవద్దు. ఆయన చెప్పినట్లు నడుచుకోవటం నేర్చుకో నీకు మోక్షం కలుగుతుంది. నీకు ఏది మంచిదో నీకంటే ఈశ్వరునికే ఎక్కువగా తెలుసు. ఆసంఘటనలు అన్ని మనమంచికే అని అర్థం చేసుకొన్న వారు అదృష్టవంతులు, ధన్యులు. విరోదులు కూడా దేహ ప్రారబ్ధాన్ని బట్టే సిద్ధమౌతారు. ఎవరో మనలను ద్వేషిస్తే మనకు నష్టం ఏమిటి? మనడబ్బుతినేస్తాడా? మన గౌరవాన్ని తినేస్తాడా? వారిగురించి ఎందుకు అల్లరి. అది ప్రారబ్ధంలో భాగం అందుచేత అటు చూచే బదులు ఆత్మను చూడండి, ఆతలంపులను చూచినవ్వుకోండి. అవే పోతాయి. ఈశరీరం ఉండగానే దైవీగుణాలను సంపాదించుకోవాలి. ఎవరిగురించి ఎక్కువ ఆలోచించకు, ఏపదార్థాన్ని చూచి ముగ్ధుడవుకాకు, నైతిక పతనమే వాస్తవమ్మృత్యువు. కర్రకు కర్ర, కత్తికి కత్తి, మాటకు మాట లోకులుచేసే పని భక్తుడైన వాడు ఇలాఉంటే నీకు జ్ఞానం

ఏమిటి? మిమ్ములను కష్టపెట్టేవారి మొఖాలలో మీ గురువును చూడగల్గు తున్నారా? భక్తుడైఉండి కష్టాలను ఓర్చుకోకపోతే నీకు భక్తి ఎక్కడిది. పాపానికి ప్రాయశ్చిత్తమే మందు. జ్ఞానాభివృద్ధికి కొండగుర్తు మీరు పక్షపాత రహితంగా ఉండటమే. వినయం ఉన్నవానికి సాధనతో పనిలేదు. కష్టాలు రాకుండా ఉండటం గొప్పవిషయం కాదు. కష్టాలు వచ్చినా చలించకుండా ఉండాలి. దేహప్రారబ్ధాన్ని ఆపుచేసుకొంటే ప్రయోజనం లేదు. కష్టాలు నిల్వఉంచకు రానీ అని భగవంతుని ప్రార్ధించాలి. తలంపువస్తే మేధావి భవిషత్తు పరిణామాన్ని ఆలోచిస్తాడు. ప్రతీమాటకు, చేతకూ, ఆలోచనకూ ప్రతిస్పందన తప్పని సరిగా ఉంటుంది ఆవిషయం మర్చిపోకండి. మీకు ఎవరి మీద మమకారం కలుగుతోందో వారి వల్లకూడా దుఃఖం వస్తుంది. ఎవరో ఏదో అన్నారని ఆరాత్రి నిద్ర పట్టని వాడు బలహీనమైన బుద్ధిగలవాడని అర్ధం. కొందరు కష్టమైన మాటలను స్మశానానికి వెళ్ళేవరకూ మోస్తూ ఉంటారు. విరోధిగా తయ్యారైయ్యాడు ఏమిటి అనుకొంటే రాముడు గుర్తుకు రాడు ఆవిరోధులే గుర్తుకువస్తారు. మన చేత అవమానం పొందినవారు స్వర్గానికి వెళతారు. మనం నరకానికి వెళతాము ఇది యదార్ధం.

స్వామి వివేకానంద "విధి ఆగ్రహించి వందరకాల విషమ పరీక్షలతో హింసిస్తే హింసించనీ, ప్రకృతి కోప గించనీ, నువ్వు నీగొప్పతనాన్ని తెలుసుకో దారిలో ఆగకు, దారితప్పకుండా గమ్యం మీద దృష్టిపెట్టుకొని ముందుకు సాగిపో" అన్నారు. భీష్ముడు ఎంత నిజాయితీగా యుద్ధం చేసినా దుర్యోధనుడి నుండి పెడసరం మాటలు విని ఆయన అనుకొంటాడు ప్రారబ్ధం అంటే ఇదేకదా! అంతటి వీరుడు అలా అనుకొంటే మనమెంత? రక్షించేవాడు ఒక్కడే చంపే అందరికంటే ఆయన ఎన్నోరెట్లు బలవంతుడు ఏదో మార్గాన్ని తప్పక చూపిస్తాడు. ఆపదలోనే సమర్ధత తెలుస్తుంది. అంతా భగవంతుడే ఇస్తాడు అనే నిర్లిప్తత ఉంటే ఈశ్వరుడే సమస్తాన్ని ఇస్తాడు. శారీరక మానసిక బాధలు భగవంతుడు ఇచ్చిన వరాలుగా భావించాలి. ప్రీతి, అప్రీతి నీగమ్యానికి అడ్డుగా వస్తున్నాయి.

సబ్జెక్ట్‌కు సంబంధించిన విషయాన్ని నీవు ప్రోపర్‌గా అర్థంచేసుకొంటే సింహాసనంమీద కూర్చునట్లు ఉంటుంది. అనుభవము అయితే తెంపులేని ఎరుకతో శాంతితో ఉంటావు. మీ గురువు మీకు కావలసిన వారితోనే తిట్టిస్తాడు అదికూడా మీరు భరించే బాధలనే కల్పిస్తాడు దోషరహితుణ్ణి

చేయ్యటానికి. బుడగ దాని శక్తికి మించి గాలిని ఊదితే పేలిపోతుంది. అలాగే గురువు అనుగ్రహం ఇయ్యటానికి సిద్ధంగానే ఉన్నాడు. నీమైండ్ పేలిపోతుందని ఊరుకొంటు న్నాడు నీకు అర్హత వస్తే ఒక్కక్షణం కూడా ఆలస్యం చెయ్యడు. ముందురాబోయే ముక్తి కోసం ఎందుకు నిరీక్షణ. మన చేతిలో పని మనం చేస్తే ఆయన ఫలితాన్ని ఎప్పుడు, ఎక్కడ ఇయ్యాలో చూచుకొంటాడు. ఇది దేశకాలాలసారాంశం. నీ విశ్వాసం అంతా ఈనమ్మకంపైనే ఉంచండి. ముందు మీరు పవిత్రులు కండి, సనుగుళ్ళు, గొనుగుళ్ళు మానండి. అనుగ్రహం రాకేంచేస్తుంది. వాస్తవంలో జీవించటం నేర్చుకోండి ఈ క్షణం చైతన్యంగా, ఎరుకగా జీవించటం నేర్చుకొంటే అప్పుడు ఉండేది ఆనందం ఇతరులు ఎంత దుర్మార్గులైనా ద్వేషం పనికిరాదు అన్నారు భగవాన్. కాబట్టి ఎవరిని చూచీ రోతపెట్టుకోకుండా ఉండండి. అయిష్టులను చూచే ప్రారబ్ధం ఉంటే నిర్మలంగా చూడండి మీ ప్రారబ్ధం ఖర్చు అవుతుంది. జలగిపోయిన గొడవలు వదులుకొంటే బ్రతుకుబంగారమైపోతుంటి. పాయసం నోట్లో పోసుకొంటే ఎలా ఉంటుందో అలాగే మీ ప్రారబ్ధాన్ని అనుభవిస్తే అప్పుడు మీకు తెలియకుండానే మీ హృదయం ఖాళీ అవుతుంది

అప్పుడు ఈశ్వరుడు దానిలో శాంతిని ఆనందాన్ని నింపుతాడు. ఆయన అస్థిత్వంపై అవిశ్వాసం రానియ్యకు నీ జీవితాన్ని ఎందుకు ఏలా మలుపు తిప్పుతాడో, ఏసత్ఫలితంవస్తుందో వేచి చూడు ఆయన చెప్పినట్లు నడుచుకొంటే మోక్షం కలుగుతుంది. అన్ని పనులు మన మంచికే అని అర్థంచేసుకోవాలి. గురు అనుగ్రహం కవచంలాంటిది. గొడుగులాంటిది. ఈ ప్రపంచం మనస్సులో ఉంది. ఇప్పుడు మనంప్రపంచంలో ఉన్నాము అనుకొంటున్నాము. ఆత్మానుభవం కలిగిన తరువాత ప్రపంచం మనలోనే ఉంది అనిపిస్తుంది. దేహము మనస్సు కలవటమే పుట్టుక, అవిరెండూ విడిపోవటమే మరణం ఇన్ని రూపాలుగా పుట్టినది "నేనే" అనే అభిప్రాయం ధృడపడితే ఎవరినీ ద్వేషించవలసిన పనిలేదు. ఏవికారమూ మనకు కలుగదు. నా ఈ మాటలు మీరు అర్థంచేసుకొంటే నాకు లాభం కాదు మీకేలాభం మీస్వరూపాన్ని పొందుతారు.

ఓం శాంతిహిః, శాంతిహిః శాంతిహిః

ఓం తత్ సత్.

